క్లుప్తంగా

పేద విద్యార్థికి పుస్తకాల వితరణ



విద్యార్థి అభిజిత్‌కు పుస్తకాలు అందజేస్తున్న శ్రీధర్

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని కణపాకకు చెందిన మారుతీ స్వయం సహాయక సంఘ సభ్యులు అదే ప్రాంతానికి చెందిన పేద విద్యార్థి బూర సాయి అభిజిత్‌కు ఇంటర్మీడియట్ చదువుకు అవసరమైన రూ.10వేలు విలువచేసిన పుస్తకాలను చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్, మధు, నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సెంచూరియన్ స్కాలర్‌కు పీహెచ్‌డీ ప్రదానం



సెంచూరియన్‌లో వీసీ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న శ్రీదేవి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో సీఎస్ఈ విభాగం స్కాలర్ గద్దె శ్రీదేవికు వీసీ ప్రశాంత కుమార్ మహంతి గురువారం పీహెచ్‌డీ ప్రదానం చేశారు. శ్రీదేవి చేసిన 'ఏ స్టడీ ఆన్ డ్రగ్ రెస్పాన్స్ అండ్ సెన్సిటివిటీ ప్రెడిక్షన్ ఆన్ క్యాన్సర్ ప్రొటీన్' అనే పరిశోధన అంశానికి ఈ అవార్డు లభించింది. డీన్ ప్రొఫెసర్ మురళీ పర్యవేక్షణలో పరిశోధన జరగగా, రీసెర్చ్ డీన్ డాక్టర్ విజయబాబు కన్వీనర్‌గా వ్యవహరించారు. పీహెచ్‌డీ సాధించిన శ్రీదేవిను పలువురు అధ్యాపకులు అభినందించారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌ల సేవలు భేష్

● వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు



ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులతో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌సీసీ క్యాడెట్‌లు అందించిన సేవలు వెలకట్టలేనివని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌సీసీ క్యాడెట్‌లతో గురువారం సమావేశమయ్యారు. వారి సేవలను అభినందిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులతో సమానంగా అంకితభావం, క్రమశిక్షణతో ఎన్నికల విధులు నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కళ్యాణ్ చక్రవర్తి, వన్‌టౌన్ ఎస్‌ఐలు జె.తారకేశ్వరరావు, ఎ.నరేష్, హరిబాబునాయుడు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రామభద్రపురం: మండలంలోని బూసాయవలసలో భూలీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త కోరాడ వెంకటరావు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు శ్రీనివాసాచార్యులు స్వామి వారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 29 మంది ఎంపిక

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సృజనా విద్యాలయం, ప్రభావతి జాగృతి ట్రస్టు సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 62 మంది కంటి రోగుల కళ్లను పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అయితే వీరిలో 29 మంది కంటి శుక్లాల ఆపరేషన్ కోసం ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. సృజనా విద్యాలయ కరస్పాండెంట్ ఎ.జనార్దనరావు, క్యాంపు కో–ఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

'వెలుగు'లో ఆడిట్

వంగర: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన పలువురు ఆడిటర్లు వంగర ఎంఎంఎస్ పరిధిలో ఉన్న గ్రామైక్య సంఘాల పరిధిలో నిధుల వినియోగంపై ఆడిట్ చేశారు. నగదు పుస్తకం, తీర్మానం పుస్తకం, లోన్ లెడ్జరీ, సాధారణ ఆవర్జ, డీసీబీ, రశీదు పుస్తకంతో పాటు పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం మీసాల చక్రపాణి, సీసీలు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు

వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు గురువారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఏఈ కోనూరు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన ప్రొటెక్షన్ వింగ్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టారు.

వానాకాలం.. మరింత అప్రమత్తం

● నగరంలో ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు
● కాలువల్లో పూడికతీత పనుల్లో పారిశుద్ధ్య సిబ్బంది
● సర్కిళ్ల వారీగా పనులు వేగవంతం చేసిన కార్పొరేషన్ యంత్రాంగం



నగరంలోని కె.ఎల్.పురం ప్రాంతంలో కాలువలో తొలగించిన పూడిక

విజయనగరం: వర్షాకాలం ఆరంభమైంది. మరో రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం నగరంలో వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు ముంపు పడకుండా ముందస్తు వ్యూహాన్ని రచించింది. ఈ మేరకు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు కార్యాచరణ సిద్ధం చేయడంతో పాటు ప్రజారోగ్య విభాగంలో క్షేత్రస్థాయిలో వి ధులు నిర్వహిస్తున్న సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 19 కిలోమీటర్ల పరిధిలో ప్రధాన కాలువలు ఉండగా.. 80 కిలోమీటర్ల మేర మధ్య తరహా కాలువలు ఉన్నాయి. ఇవి కాకుండా వీధుల్లో చిన్నపాటి కాలువలు సుమారు 300 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నట్టు అంచనా. 50 డివిజన్ల పరిధిలో విస్తరించి ఉన్న నగరంలో సుమారు 3 లక్షల మంది జనాభా ఉండగా.. భారీ వర్షాలు కురిసే సమయంలో లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. దీనికి చెక్‌పెట్టేందుకు నగరంలోని అన్ని ప్రధాన చిన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగిస్తున్నారు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగిస్తున్నారు. దీనికోసం బృందాల వారీగా పనులు చేపడుతున్నారు.

పారిశుద్ధ్య పనుల్లో బిజీ

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జేసీబీలు–2, బాబ్‌కార్డ్‌లు 3 ఉండగా... 7 సర్కిళ్లలో విధులు నిర్వహిస్తున్న 490 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది, 190 మంది రెగ్యులర్ సిబ్బంది పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగిస్తున్నారు. ఉదయం వేళ యథావిధిగా ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణ చేస్తుండగా, మధ్యాహ్నం వేళల్లో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం నగర పరిధిలో 125 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా.. ఆ మొత్తాన్ని 60 మెట్రిక్ టన్నులకు తగ్గించాలన్నదే ధ్యేయంగా ఈ పనులు చేపడు తున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

మధ్యాహ్నం వేళల్లో..

వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించే పనులు చేపడుతున్నాం. ఉదయం వేళల్లో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి, మధ్యాహ్నం వేళల్లో కాలువల శుభ్రం చేసేలా కార్యాచరణ రూపొందించాం. ఈ మేరకు పనులు జరుగుతున్నాయి. నగరంలో ప్రతిరోజూ 125 మెట్రిక్ టన్నులకుపైగా చెత్త ఉత్పత్తి అవుతుంది. సేకరించిన చెత్తను వేరుచేసి గుణుపూరుపేట డంపింగ్ యార్డ్‌కు, విశాఖకు తరలిస్తున్నాం.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

పరిశుభ్రతకు పెద్దపీట



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగ: గ్రామాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, పారిశుద్ధ్య పనులు నిరంతరాయంగా చేపట్టాలని ఎంపీడీఓ ఎం.రాధిక సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మురుగు కాలువల్లో పూడికలు తొలగించాలన్నారు. వ్యక్తిగత్త మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలో వీధి లైట్లు వెలిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌శంకర్, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న ఎస్.వి.రమణ

రేగిడి: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం, ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండడం, సామాజిక సేవ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండలంలోని వావిలవలస రామాలయంలో గ్రామానికి చెందిన వారణాసి జగన్నాథ స్వామి ఆధ్వర్యంలో గురువారం ఆధ్యాత్మిక దివ్య మహాసభ నిర్వహించారు. ముందుగా పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఎస్.వి.రమణ మాట్లాడుతూ మానవసేవే మాదవ సేవ అని, ఆపదలో ఉన్న సాటి మనిషికి సహాయ పడాలని సూచించారు. దేవుదలకు చెందిన గొర్లె దామోదరరావు, దశమంతుపురం గ్రామానికి చెందిన సతివాడ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



అవగాహన కల్పిస్తున్న పీఆర్‌పీ రమాదేవి

రేగిడి: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని, సేంద్రీయ ఎరువులతో పంటలను సాగు చేసి మంచి దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ రమాదేవి అన్నారు. గుల్లపాడు క్లస్టర్ పరిధిలోని వండానపేట, కె.ఎం.వలస గ్రామాల రైతులకు, స్వయం శక్తి సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విచ్చల విడిగా రసాయన ఎరువులు వినియోగిస్తుండడం వల్ల క్రమంగా భూసారం తగ్గిపోతోందని, తెగుళ్ల ఉధృతి ఎక్కువైపోతోందని అన్నారు. ఆవుపేడ గత్తం, గొర్రె గత్తం, ఘన, ధన జీవామృతాలుచ కషాయాలు వంటివి వినియోగించి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల జీవ వైవిధ్యం బాగుంటుందన్నారు. ఎస్‌డీఏ జె.అప్పలనాయుడు, ఐసీపీ కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



రంగప్పవలసలో చెరువు గట్టుపై కొబ్బరి, టేకు మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

తెర్లాం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని రంగప్పవలస గ్రామ సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. గ్రామంలోని రెండు చెరువుగట్లపై గ్రామస్తులతో కలిసి గురువారం కొబ్బరి, టేకు, పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆరు చెరువు గట్లపై ఇప్పటికే 200 కొబ్బరి మొక్కలు, సుమారు 1,500 టేకు మొక్కలు నాటామని, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలోని మరో రెండు చెరువుగట్లపై కొబ్బరి, టేకు, పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. చెరువు గట్లపై కొబ్బరి మొక్కల పెంపకం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరుతుందని చెప్పారు.

విత్తన కొరత రానీయొద్దు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

● ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాల కొరత రానీయకుండా చూడాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పి.అదితిగజపతిరాజు అధికారులకు సూచించారు. విజయనగరం మండలంలోని జొన్నవలస పీఏసీఎస్ కేంద్రం వద్ద గురువారం సాయంత్రం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో సుమారు 7 వేల మంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో 3,700 ఎకరాల వరకు వరి సాగు చేస్తారని, అందుకు 11 వందల నుంచి 15 వందల క్వింటాల విత్తనాలు అవసరమవుతాయని మండల వ్యవసాయాధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు ఎంపీ,ఎమ్మెల్యేలకు తెలిపారు. ప్రస్తుతం 14 రైతు భరోసా కేంద్రాల్లో 11 వందల క్వింటాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జేడీఏ వీటీ రామారావు, తహసీల్దార్ పీవీ రత్నం, ఎంపీటీసీ పి.రాజేష్, ప్రజాప్రతినిధులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం లక్ష్యాలను చేరుకోవాలి



సిబ్బందితో సమావేశమైన ఎంపీడీఓ రవికుమార్

బొబ్బిలిరూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కల పెంపకానికి సంబంధించిన లక్ష్యాలను చేరుకోవాలని ఉపాధి హామీ పథకం సిబ్బంది, అధికారులకు ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చెరువు గట్లపై కొబ్బరి మొక్కలు నాటించాలని ఆదేశించారు. అలాగే ఆసక్తి ఉన్న రైతులకు ఉద్యాన,వాణిజ్యరకాలైన టేకు, మామి డి, జామ, పామాయిల్ వంటి మొక్కలను పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా,ప్రధాన కూడళ్లలో నీడనిచ్చే వేప,చింత,కానుగ,తురాయి వంటి మొక్కలు నాటించాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాడంగి: మండలంలోని గజరాయునివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ టి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎరుకులపాకలు, తెంటువలస, పింద్రంగివలస, వీరసాగం, డొంకినవలస, పిన్నవలస, కోడూరు, అచ్చియ్యపేట, గొల్లలపేట, బ్రహ్మన్నవలస గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరా ఉండదని,వినియోగదారులు తమ శాఖసిబ్బందితో సహకరించాలని కోరారు.

బొబ్బిలి డివిజన్ పరిధిలో..

బొబ్బిలి: స్థానిక డివిజన్ పరిధిలోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ బలిజిపేట ఫీడర్ మధ్య ఉన్న విద్యుత్ లైన్లను సరిచేసే పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఆవాల అనంతరావు గురువారం తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటలవరకు బలిజిపేట, పిరిడి, వంతరాం, నెమలాం, పినపెంకి సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు, అలాగే పట్టణపరిధిలోని పూల్‌బాగ్,మహారాణిపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బూరాడ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏడీఈ ఫణీంద్రకుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బూరాడ, లచ్చారాయపురం, నాయిరాలవలస, తునివాడ, వెంకంపేట, ఉణుకూరు, ఒప్పంగి, పెదశిర్లాం, పనసలవలస, పారంపేట, ఎం.డోలపేట తదితర గ్రామాలకు ఈ అసౌకర్యం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్ల సరఫరా

వేపాడ: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించిన స్టూడెంట్ కిట్స్‌ను అధికారులు గురువారం చేరవేశారు. మండల విద్యావన రుల కేంద్రంలో ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు పుస్తకాల సరఫరా వాహనాలను జెండాఊపి ప్రారంభించారు. మండలంలో 50 పాఠశాలల్లోని 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బెల్ట్‌లు, సాక్స్‌లు, టైలు, బూట్లు తదితర కిట్లను పాఠశాలలకు పంపించా మని ఎంఈఓలు చెప్పారు. పలు పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, సీఆర్పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీల్లోని ప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు స్టూడెంట్ కిట్లను హెచ్‌ఎంలకు ఎంఈఓ ఎం.వెంకటరావు మండల కేంద్రంలో గురువారం అందజేశా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి పాఠ్య,నోట్ పుస్తకాలు, బూట్లు, అందజేస్తామని చెప్పారు. ఎంఈఓ–2 సుధాకర్, సీఆర్పీలు, తిరుపతిరావు, సత్యనారాయణ, దమ యంతి,తదితరులు పాల్గొన్నారు.

3,836 మందికి

గజపతినగరం: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్నామని ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ తెలిపారు. స్థానిక బాలుర హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ నుంచి గురువారం పాఠశాలల వారీగా కిట్లను హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 3,836 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయనున్నామని చెప్పారు. ప్రతీ విద్యార్థికి బూట్లు, రెండు జతల సాక్స్‌లు, మూడు జతలు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ, బెల్టులు, బ్యాగ్ తదితర సామగ్రిని ప్రతీ కిట్లో ఉంచామని తెలిపారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

● నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ
● రాయితీపై వరి విత్తనాల పంపిణీకి సిద్ధం



ఎస్.కోట రైతు భరోసా కేంద్రంలో పంపిణీకి సిద్ధం చేసిన వరి విత్తనాలు

శృంగవరపుకోట: ఖరీఫ్ సాగుకు అధికారులు, రైతాంగం సిద్ధమవుతోంది. రైతాంగానికి కావాల్సిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందివ్వడంతో పాటూ, వారికి కావాల్సిన సమాచారం తెలియజేస్తూ విత్తనాలు రాయితీపై అందిస్తోంది. ఇప్పటికే నేలసారం పెంచేలా నవధాన్యాల విత్తనాలు, పచ్చిరొట్ట పైరుల విత్తనాలు రాయితీపై రైతాంగానికి అందజేశారు. ప్రస్తుతం నైరుతి రుతు పవనాల పలకరింపు తో ఖరీఫ్ పనులకు రైతులు సిద్ధం అవుతుండగా వారికి సహకారం అందించేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమవుతోంది.

భూసారం పెంపే లక్ష్యంగా...

భూసారం పెంచడమే లక్ష్యంగా వ్యవసాయశాఖ విస్తృత ప్రచారం చేస్తూ రైతుల్లో నవధాన్యాల సాగు, పచ్చిరొట్ట పైరుల పెంపకంపై అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు, నవధాన్యాల కిట్లు అందజేశారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్నారు.

రాయితీపై పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతాంగానికి విత్తనాలు రాయితీపై పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)కు చేరవేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాల్లో 8,472 మెట్రిక్ టన్నులు వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు.

ఎస్.కోట నియోజక వర్గంలో మండలాల వారీగా కేటాయించిన వరి విత్తనాలు (మెట్రిక్ టన్నుల్లో)	
ఎస్.కోట	1,872.75
జామి	2,367.25
వేపాడ	1,533.25
ఎల్.కోట	2,142.25
కొత్తవలస	552.25

రైతులకు అందజేయనున్న వరివిత్తనాలు, ధరలు, రాయితీ వివరాలు

విత్తన రకం	కిలోలు (బ్యాగ్)	పూర్తి ధర	రాయితీ	రైతుకు అందించే ధర
బీపీటీ–5204	25	రూ.4,180	రూ.1,000	రూ.3,180
ఎంటీయూ–1224	25	రూ.4,180	రూ.1,000	రూ.3,180
ఆర్‌జీఎల్–2537	30	రూ.4,180	రూ.1,000	రూ.3180
బీపీటీ– 3291	30	రూ.3,780	రూ.1,000	రూ.2780
ఎంటీయూ–1064	30	రూ.3,980	రూ.1,000	రూ.2980
ఎంటీయూ–7029	30	రూ.3,980	రూ.1,000	రూ.2980
ఎంటీయూ–1061	30	రూ.3,980	రూ.1,000	రూ.2,980
ఎంటీయూ–1121	30	రూ.3,980	రూ.1,000	రూ.2,980
ఎంటీయూ–1318	30	రూ.3,980	రూ.1,000	రూ.2,980
ఎస్ఎల్ఆర్– 34449	30	రూ.4,050	రూ.1,000	**రూ.3,050**
ఆర్ఎన్ఆర్–15048	25	రూ.4,180	రూ.1,000	రూ.3,180

ఆర్బీకేల్లో పంపిణీకి సిద్ధం



నియోజకవర్గ పరిధిలో నేల స్వభావం, పరిస్థితులకు తగిన విధంగా వరి విత్తనాలు ఇండెంట్ పెట్టాం. వరి విత్తనాలు రాయితీపై ఇచ్చేందుకు అన్ని రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాం. రైతులు తమ నేల స్వభావాన్ని బట్టి విత్తన ఎంపిక చేసుకుని, వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదించి తగిన అవగాహనతో వరి నారు పోసుకోవాలి.

– ఎల్.విజయ, కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీ

వరి విత్తనాలు- వాటి గుణాలు :

రకం: ఎంటీయూ -7029 (స్వర్ణ)
పంటకాలం: 150 రోజులు
దిగుబడి :ఎకరానికి 3 టన్నులు
గుణాలు: అన్ని భూములకు అనుకూలం, అధిక దిగుబడి, అగ్గితెగులు ఆశించే అవకాశం

రకం: బీపీటీ- 3291 (సోనామసూరి)
పంటకాలం: 135–140 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.5 టన్నులు
గుణాలు: గింజ సన్నం, అన్నానికి బాగుంటుంది. అగ్గితెగులు ఆశించే అవకాశం ఎక్కువ.

రకం: బీపీటీ–5204 (సాంబ మసూరి)
పంటకాలం: 145–150 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.5 టన్నులు
గుణాలు: సన్నబియ్యం, అన్నం మృదువుగా ఉంటుంది, మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది, దోమ ఆశించే అవకాశం ఉంది.

రకం: ఎంటీయూ–1075 పుష్యమి
పంటకాలం: 135 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.5 టన్నులు
గుణాలు: సన్నబియ్యం, చేను పడిపోదు, అగ్గితెగులు, దోమపోటు తట్టుకుంటుంది.

రకం: ఎంటీయూ- 1064(అమర)
పంటకాలం: 150 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.5టన్నులు
గుణాలు: సన్నబియ్యం, చేను పడిపోదు, గింజరాలదు, ముంపును తట్టుకుంటుంది. దోమపోటును తట్టుకుంటుంది.

రకం: 34449 (నెల్లూరి మసూరి)
పంటకాలం: 125 రోజులు
దిగుబడి: ఎకరానికి 3.2 టన్నులు
గుణాలు: చేను పడిపోదు, పొట్టి రకం, గింజ నాణ్యత ఉంటుంది.అగ్గితెగులు తట్టుకుంటుంది.

రకం: ఆర్‌జీఎల్–2537(శ్రీకాకుళం సన్నాలు)
పంటకాలం: – 165 రోజులు
దిగుబడి: ఎకరానికి 3 టన్నులు
గుణాలు: చేను పడిపోదు,పొట్టిరకం, మిక్కిలి సన్నరకం, 60 రోజుల వరకూ నాటుకోవచ్చు. ఉల్లికోడును తట్టుకుంటుంది.

రకం: ఎంటీయూ–1121(శ్రీధృతి)
పంటకాలం: 120–125 రోజులు
దిగుబడి: ఎకరానికి 2.4టన్నులు
గుణాలు: మధ్యస్థ సన్నరకం, కాండం దృఢంగా ఉంటుంది. చేను పడిపోదు. చీడపీడలు ఆశించవు.